నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
10 | శనివారం 5 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మంచిర్యాల ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న విశ్రాంత కార్మికులు

సమస్యలు పరిష్కరించాలి

● ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల డిమాండ్ ● మంచిర్యాల డిపో ఎదుట ధర్నా

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 4: దీర్ఘకాలికంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మంచిర్యాల ఆర్టీసీ డిపో ఎదుట రిటైర్డ్ కార్మి కులు ధర్నా నిర్వహించారు. రిటైర్డ్ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు రిటైర్డ్ కార్మి కులకు రావాల్సిన డీఏ బకాయిలు అంద జేయాలని, ఆర్‌పీఎస్ 2017 పే ఫిక్షేషన్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఏప్రిల్ 2022 తర్వాత ఉద్యోగ విరమణ పొందిన వారికి సెటిల్‌మెంట్, లీవుల ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బు లు అందించాలని కోరారు. రిటైర్డ్ ఉద్యో గులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయా ణ సౌకర్యం కల్పించాలని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్‌పీఎస్ 2021 పే ఫిక్షేషన్‌ను ప్రకటించి, పెరిగిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎంఎస్ పాషా, కే ప్రకాశ్, హజ్‌గర్ పాషా, కేఎంఎస్ రెడ్డి, జీసీ మాణిక్యం, కేబీ ముబారక్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎమ్మెల్యే కాళ్లు మొక్కుతున్న పద్మ, కుర్చీలో ఆమె భర్త

బాంచెన్ జర ఆదుకోండి

బెల్లంపల్లి ఎమ్మెల్యే కాళ్లు మొక్కి వేడుకున్న మహిళ

కాసిపేట, ఏప్రిల్ 4 : 'నా భర్త అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యిండు. ఆపరేషన్ చేయిస్తే పరిస్థితి మరింత వికటించింది. మొత్తం లేవకుండా అయ్యిండు. బాంచెన్.. జర పింఛన్ ఇప్పించి ఆదుకోండి' అంటూ మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం మల్కెపల్లి గ్రామానికి చెందిన మాసు పద్మ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కాళ్లుమొక్కి వేడుకున్నది. శుక్రవారం కాసిపేట మండల కేంద్రంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి కలెక్టర్, ఎమ్మెల్యే హాజరయ్యారు. అదే సమయంలో అనారోగ్యంతో కుర్చీకే పరిమితమైన తన భర్త మాసు చిన్నయ్యతో కలిసి అక్కడికి చేరుకున్నది. తన భర్త ఆరోగ్య పరిస్థితిని వివరించి సంబంధిత రిపోర్టులు చూపించి ఆదుకోవాలని విలపించింది. కలెక్టర్, ఎమ్మెల్యే స్థానికంగా ఉన్న అధికారులకు వివరాలు తెలుసుకొని తమకు తెలియజేయాలని సూచించారు. ఆమెకు సాయమందిస్తామని భరోసా ఇచ్చారు.

పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి, ఏప్రిల్ 3 : టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ప్రచార కార్యదర్శి దాసరి శ్రీనివాస్ తండ్రి రాజం(75) మృతి చెందగా, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆయన అంత్యక్రియలకు హాజరై పాడె మోశారు. బెల్లంపల్లి సింగరేణి ఏరియా దవాఖానలో రాజం గురువారం రాత్రి మృతి చెందాడు. శుక్రవారం ఆయన అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య హాజరయ్యారు. రాజం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్‌ను పరామర్శించి సానుభూతి ప్రకటించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. టీబీజీకేఎస్ నాయకులు వెంకటరమణ, బడికెల రమేశ్, ఆవుల రవికిరణ్, శాంతిఖని గని, సివిక్ విభాగం ఉద్యోగులు, కార్మికులు, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు ఉన్నారు.

మేమే కొంటాం.. అమ్ముతాం

● ఇతరులెవ్వరినీ ఇక్కడ కొననీయం

● కన్నెపల్లిలో రేషన్ బియ్యం మాఫియా దౌర్జన్యం

కన్నెపల్లి, ఏప్రిల్ 4 : 'ఇక్కడ రేషన్ బియ్యం మేమే కొంటాం.. మేమే అమ్ముతాం.. ఇతరులెవ్వరు కొన్నా.. అమ్మినా ఊరుకోం' అంటూ శుక్రవారం కన్నెపల్లి మండలం పోలంపల్లిలో రేషన్ బియ్యం మాఫియా దౌర్జాన్యానికి దిగింది. శుక్రవారం ఉదయం పోలంపల్లిలో కొందరు ఆటోలో వచ్చి రేషన్ బియ్యం కొన్నారు. ఆపై తిరిగి వెళ్తుండగా జన్కాపూర్‌కు చెందిన కొందరు వ్యక్తులు వారిని అడ్డుకున్నారు. మా మండలంలో మీరెవరు బియ్యం కొనడానికి అంటూ వారితో వాగ్వాదానికి దిగారు. వారివద్దనున్న బియ్యాన్ని లాక్కొని దౌర్జన్యంగా బొలెరో వాహనంలో ఎక్కించుకున్నారు. ఇది గమనించిన రైతులు అక్కడికి చేరుకొని ఎక్కడి నుంచో వచ్చిన వారిపై మీ ప్రతాపం ఏమిటని తిరగబడ్డారు. దీంతో వారు చేసేదేమి లేక బియ్యం తిరిగి ఇచ్చేశారు. కాగా, కొంత కాలంగా అన్ని గ్రామాల్లోని రేషన్ డీలర్లు సైతం వీళ్లకే అమ్మాలని చెప్పినట్లు సమాచారం. ఇందులో భాగంగానే మాఫియా వారితో గొడవకు దిగినట్లు తెలుస్తున్నది.

బీఆర్ఎస్ నాయకుడిపై క్రిమినల్ కేసు

బెల్లంపల్లి, ఏప్రిల్ 4 : బెల్లంపల్లి పట్టణ బీఆర్ఎస్ నాయకుడు నూనెటి సత్యనారాయణపై శుక్రవారం క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ తెలిపారు. మండల శివారులోని డబుల్ బెడ్ రూం ఇండ్ల ముందున్న ఖాళీ స్థలాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో కొంతమంది కాంగ్రెస్ నాయకులు కబ్జా చేస్తున్నారని బెల్లంపల్లి నియోజకవర్గం, బెల్లంపల్లి పొలిటికల్ గ్రూప్‌లలో అసత్యప్రచారం చేశారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. అసత్యప్రచారం చేసి శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

3 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ అధికారులు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 4 : చింతలమానేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం భారీగా నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానేపల్లి గ్రామ శివారులో నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నారన్న పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్న బూరుగూడ గ్రామానికి చెందిన లోకండే భిక్షపతిని పట్టుకొని విచారించగా.. గుంటూరుకు చెందిన సురేశ్ వద్ద నకిలీ బీటీ విత్తనాలు కొనుగోలు చేసి రైతులకు అమ్ముతున్నట్లు ఒప్పుకున్నాడు. రూ. 10.50 లక్షల విలువైన 3 క్వింటాళ్ల నకిలీ బీటీ-3 పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. భిక్షపతిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్, కానిస్టేబుల్ మధు, రమేశ్, సంజీవ్, దేవేందర్, సాదిక్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.



● ఇదేమి వైఖరి అంటూ మండిపడుతున్న కాంట్రాక్టర్లు

● ప్రతిష్టాత్మకంగా పూర్తి చేసిన పనులకు ఇప్పుడు టెండర్లట..

● మంచిర్యాల కార్పొరేషన్‌లో మారని తీరు

● విమర్శల పాలవుతున్న అధికార పార్టీనాయకులు, అధికారులు

నేను చెప్పినోళ్లకే టెండర్లు!

కాంట్రాక్టర్లందరికీ అధికార పార్టీ కీలక నేత హుకుం

'అది ఏ పనైనా సరే నాకు తెలియకుండా టెండర్ వేయొద్దు. నేను చెప్పినోళ్లే వేస్తారు. అది వాళ్లకే వస్తది. ఒకవేళ నన్ను కాదని ఎవరైనా వేశారో బాగుండదు'.. ఇలా జిల్లా కేంద్రానికి చెందిన అధికార పార్టీ కీలక నేత కాంట్రాక్టర్లందరికీ హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఇక్కడ జరిగే అభివృద్ధి పనుల విషయంలో ఆయన ఏది చెబితే.. అదే ఫైనలట. రూ. 10 లక్షలు పెట్టి రోడ్డు వేసినా.. రూ. 10 కోట్లతో బిల్డింగ్ కట్టినా.. అది ఎలాంటి పనైనా సరే.. ఆ సార్ చెప్పినోళ్లే టెండర్ వేయాలట. ఇక అధికారులు సైతం ఆ నేత చెప్పినట్లే వింటూ నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మంచిర్యాల, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జిల్లా కేంద్రంలో కొందరు అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. అభివృద్ధి పనుల విషయంలో ఓ కీలక నేత అన్నీ తానై నడిపిస్తూ.. తాను చెప్పినోళ్లే టెండర్లు వేయాలని ఆదేశాలివ్వడం.. ఇందుకు అధికారులు కూడా సహకరించడం.. కాంట్రాక్టర్లు భయపడి ముందుకు రాకపోవడం స్థానికంగా చర్చనీయాంశమవుతున్నది.

కార్పొరేషన్ అయినా అంతేనా..?

మంచిర్యాల మున్సిపాలిటీగా ఉన్నప్పుడు గతేడాది కొన్ని పూర్తయిన పనులకు టెండర్లు పిలిచారు. పూర్తయిన పనులకు టెండర్లు ఎలా పిలుస్తారంటూ మీడియాలో అనేక కథనాలు ప్రచురితమయ్యాయి. గతంలో చేసిన పనుల్లో మిగిలిన డబ్బుతో ఈ పనులు చేయించామని, ఆ పనులకు ఇప్పుడు టెండర్ పిలిచామంటూ చెప్పుకొచ్చారు. మిగిలి న డబ్బుతో పని పూర్తయ్యాక కొత్తగా టెండర్ పిలవడం ఎందు కు.. ఎవరి చేబుల్లోకి ఈ డబ్బులు వెళ్తాయనే సందేహాలు అప్పట్లో వ్యక్తమయ్యాయి. అలా చేయడం నిబంధనలకు విరుద్ధమని, టెండర్ల కోసం కొందరు వంతుల వారీగా టెండర్లు దక్కించుకునేలా అంగీకారానికి వచ్చి ఇలా పూర్తయిన పనులకు టెండర్లు పిలిచారని, ఈ వ్యవహారం మొత్తాన్ని మున్సిపాలిటీలో ఓ నేత ముందుండి నడిపిస్తున్నారని తెలిసి ఎమ్మెల్యే సదరు నా యకుడిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు అప్పట్లో గుసగుసలు వినిపించాయి. అనంతరం ఆ టెండర్లను రద్దు చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీ నుంచి మున్సిపాల్ కార్పొరేషన్‌గా ఏర్పడ్డాక కూడా ఈ టెండర్ల వ్యవహారంలో మార్పు రాలేదు. పూర్తయిన పనులకు మరోసారి టెండర్లు పిలవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అది కూడా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేపట్టిన ఓ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లు కావడం గమనార్హం. ఇప్పటికే పనులు పూర్తయ్యాయని రేపో.. మాపో.. ప్రారంభిస్తారని ప్రచారం చేసుకుంటూ.. పూర్తయిన పనులకు టెండర్లు పిలవడం వెనుక మతలబేమిటి అన్నది అర్థం కాకుండా పోయింది.

ఎమర్జెన్సీ పనులు కాకున్నా.. ముందస్తు అనుమతులు

ఎమర్జెన్సీ ఉందని, స్థానిక అధికార పార్టీ కీలక నేత ప్రియార్టీ ప్రాజెక్ట్ కావడంతో ముందస్తు అప్రూవల్ తీసుకొని పనులు చేశారంటూ మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. సరే నిజంగానే అది అత్యవసరమైతేనో.. తక్కువ ఖర్చుతో అయ్యేదైతేనో పార్వాలేదు అనుకోవచ్చు. కానీ, కోట్లాది రూపాయాల పనులకు ముందస్తు అనుమతి ఏమిటి అన్నది ఇక్కడ ప్రశ్నార్థకంగా మారింది. సాధారణంగా రూ.లక్షలోపు పనులను టెండర్ లేకుండా నామినేషన్‌పై చేసుకోవచ్చు. రూ.లక్ష దాటితే ఆ పనులకు కచ్చితంగా ఈ-ప్రొక్యూర్‌మెంట్ లేదా బాక్స్ టెండర్ పిలవడం తప్పనిసరి. కానీ, ఇక్కడ ఈ నిబంధనలు ఏవీ పట్టించుకోలేదు. కీలక నేత పర్సనల్ ఇంట్రెస్ట్ అంటూ పనులు చేసి, పూర్తయిన పనులకు దాదాపు రూ.4 కోట్ల టెండర్లు పిలవడం విమర్శలకు తావిస్తున్నది. నిబంధనలు పాటించాల్సిన మున్సిపల్ అధికారులే వాటిని ఉల్లంఘించిన తీరుపై కొందరు కాంట్రాక్టర్లు మండిపడుతున్నారు. ఎన్నో ఏండ్లుగా పనులు చేస్తున్నామని.. ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదని చెబుతున్నారు. రూ.4 కోట్ల పనులకు పెండింగ్ అప్రూవల్ ఇచ్చి పనులు చేయించడం వెనుక అధికార పార్టీ కీలక నేతతో పాటు అధికారుల ధనదాహం సైతం ఉందంటూ మండిపడుతున్నారు. జిల్లాలో ఏ పనులు చేసినా సదరు నేత తనకు కావాల్సిన వ్యక్తులకే టెండర్లు ఇస్తున్నారని, కనీసం టెండర్లు వేయనివ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ చెప్పకుండా టెండర్లు వేస్తే.. చేసే పనులకు బిల్లులు రావంటూ ఆయన చెబుతుంటే ఏం చేయలేకపోతున్నామని చెబుతున్నారు.

నాసిరకంగానే పనులు..

ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ గతంలో ఎవ్వరూ చేయని విధంగా చేస్తున్నారు. పనులను పూర్తి చేసి అనంతరం కోట్లాది రూపాయలకు టెండర్లు పిలుస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తైతే.. చేస్తున్న పనులు నాసిరకంగా ఉన్నాయనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. సాధారణంగా ఏ నిర్మాణం చేసినా మట్టి పోసి అది గట్టి పడే వరకు ఆగాలి. కానీ, ఈ ప్రాజెక్ట్ విషయంలో మట్టిపోసి వెంటనే పనులు చేశారు. దీంతో అడుగుభాగంలో వేసిన సిమెంట్ దిమ్మెలు నడుస్తుంటేనే కదులుతున్నాయి. ఎత్తు, పల్లాలుగా మారి నాణ్యతలోపానికి నిదర్శనంగా కనపడుతున్నాయి. హడావుడిగా చేసిన గ్రీనరీ వర్క్స్‌తో చెట్లు, గడ్డి సైతం ఎండిపోతున్నా యి. ఇక చేపట్టిన నిర్మాణ పనులకు సరిగా క్యూరింగ్ చేయలే దు. దీంతో అవి ఏ మేరకు నాణ్యతగా ఉన్నాయనేది దేవుడికే తెలియాలి. భారీ వర్షాలు పడితే అడుగుభాగంలో వేసిన సిమెం ట్ దిమ్మెలు పెచ్చులుగా లేచిపోవడం ఖాయంగా కనిపిస్తున్నది. ఇలా హడావుడిగా నాసిరకంగా పూర్తి చేసిన పనులకు రూ.4 కోట్లకు టెండర్లు పిలవడం గమనార్హం. నిబంధనల ప్రకారం టెండర్లు పిలిచి పనులు అప్పగించి ఉంటే 100శాతం బాగా చేయించుకునేందుకు వీలుండేదని, హడావుడిగా పనులు పూర్తి చేయించి ఇప్పుడు టెండర్లు పిలిస్తే పనులు ఇలాగే ఉంటాయంటూ పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ లీడర్లు, మున్సిపల్ అధికారులు తీరు మార్చుకోవాలని.. నాణ్యతతో పనులు జరిగేలా చూడాలని కోరుతున్నారు.

కాసులిస్తేనే చెత్త తీస్తరట!

మంచిర్యాల బస్టాండ్ ప్రాంతం చెత్తతో నిండిపోతున్నది. కొన్ని రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తరలించకపోవడంతో అక్కడి పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతున్నది. ఈ విషయమై ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా.. మున్సిపాలిటీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లామని, వారు కాసులిస్తేనే చెత్త తొలగిస్తామంటున్నారని తెలిపారు. ఇక ఈ అంశంపై హెల్త్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కిరణ్ స్పందిస్తూ.. సిబ్బంది డబ్బు లు అడిగినట్లు తేలితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

- మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మంచిర్యాల బస్టాండ్ వద్ద పేరుకుపోయిన చెత్త

పోడు భూములకు పట్టాలివ్వాలి

● సీపీఎం, ఆదివాసీ గిరిజన సంఘాల డిమాండ్ ● దండేపల్లిలో ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

దండేపల్లి, ఏప్రిల్ 4 : ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని సీపీఎం, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం దండేపల్లి మండల కేంద్రంలో ర్యాలీ తీశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో పూర్తిగా విఫలమైందని, ఏ ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వలేదన్నారు. పల్లెల్లో పారిశుధ్యం లోపించిందని, తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వెంటనే సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సుంకె రవి, కనికరపు అశోక్, చందు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్‌కుమార్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్లా, శ్యామల ఉమారాణి, సిడాం సమ్మక్క, లింగన్న, లక్ష్మణ్, రమాదేవి, ఆయా గ్రామాల గిరిజనులు, నాయకులు పాల్గొన్నారు.

దండేపల్లిలో ర్యాలీ తీస్తున్న సీపీఎం శ్రేణులు

మాట్లాడుతున్న ఏఎస్పీ చిత్తరంజన్

67 మందిపై రౌడీషీట్ ఎత్తివేత

ఏఎస్పీ చిత్తరంజన్ నిర్ణయంపై బాధితుల హర్షం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 4 : ఓ వైపు తప్పు చేసిన వారిని దండిస్తూనే.. మరో వైపు సత్ప్రవర్తన కలిగిన వారిపై కేసులు ఎత్తివేస్తున్నారు ఆసిఫాబాద్ సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మొత్తం 67 కేసులు ఎత్తివేశారు. ఏఎస్పీగా చిత్తరంజన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లో 368 హిస్టరీ షీట్లు ఉండగా, ఇందులో 289 అనుమానిత కేసులు, 79 రౌడీషీట్లు ఉన్నాయి. వీరిలో గత పదేళ్లుగా ఎలాంటి గొడవలకు వెళ్లకుండా సత్ప్రవర్తన కలిగిన 67 మందిపై కేసులు ఎత్తివేశారు. దీంతో వారంతా హర్షం వ్యక్తం చేశారు. ఏఎస్పీ చిత్తరంజన్ మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పు చేయడం సహజమని, ఆ తప్పును తెలుసుకొని మారడం మంచి విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి నందగోపాల్

జిల్లాలో కొత్తగా రెండు బార్లు

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 4 : జిల్లాలోని బెల్లంపల్లి, మంచిర్యాలలో బార్లు ఏర్పాటు చేసుకునేందుకు నోటిఫికేషన్ విడుదల చేస్తున్నామని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి నందగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. దరఖాస్తు ఫారం ఏ-1కు మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ లేదా పాన్ కార్డు జిరాక్స్‌లను జతపరచాలని, దరఖాస్తు రుసుము రూ.1 లక్ష(నాన్ రిఫండబుల్)తో డీడీ తీయాలని, పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఈ నెల 26న సాయంత్రం 5 గంటల్లోగా మంచిర్యాల లేక ఆదిలాబాద్ లేక హైదరాబాద్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయాల్లో అందజేయాలని తెలిపారు. ఈ నెల 29న కలక్టరేట్‌లో లాటరీ పద్ధతిన బార్లు కేటాయిస్తామన్నారు. వివరాలకు htpp://tgbcl.tealgana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.